
# 1




# నిశ్శబ్దం

సుమనస్పతి

మీరు ఎన్నో ఊళ్లను, పల్లెలను చూసి ఉంటారు. ఆ తెలంగాణా గ్రామం పక్క నుంచి కూడా ఏదో ఒకనాడు వెళ్లే ఉంటారు. ఏ విశేషం లేని ఆ ఊరి గుర్తులు మీ జ్ఞాపకాల దొంతరల్లో ఎక్కడో సమసిపోయి ఉంటాయి.

లేదా నిర్వీర్యంగా గడిచే రోజుల్లో ఏ సాయంత్రం పూటో ఆరు బయట కూర్చొని ఆకాశంలో రంగుల్ని గమనిస్తున్నప్పుడు మీ ఆలోచనాపటంపైన ఆ ఊరి ఆనవాళ్లు తళుక్కున మెరుపులా మెరుస్తాయేమో? ఏ విషయం ఎవరి హృదయంలో ఎందుకు హత్తుకుపోతుందో ఎవరు చెప్పగలరు? ప్రతి ఊరినీ ఆవరించి ఒక వ్యక్తిత్వంలాంటిది ఉంటుంది కాబోలు - అదేదో మన అనుభవంలోకి రావాలి గాని.

ఈ సొదంతా ఏమిటి, మనుషులకే వ్యక్తిత్వం తగ్గి అనుబంధాలు, విలువలు పతనమై పోతున్న కాలంలో ఊళ్లకీ, పట్టణాలకీ వ్యక్తిత్వం అంటగట్టడం ఏమిటి అని మీరు చికాకుపడవచ్చు. క్షమించాలి, ఇలాంటి వాటికి నేను జవాబు చెప్పగలవాణ్ణి కాదు. కాని ఆ ఊరు, ఆ మనిషి గుర్తుకు వచ్చినప్పుడల్లా నాలో నేనే విషాదంగా నవ్వుకొంటాను. కేవలం నా మానసిక ప్రపంచంలో ఇమిడిపోయిన గుర్తులు, జ్ఞాపకాలు, ఆలోచనలు అవన్నీ- కాని అదేమి చిత్రమో! అవి సూచించే అర్థాలు ప్రపంచాన్నంతటినీ ఆవరించి తడిపేస్తున్నట్టు నాకు అనిపిస్తూ ఉంటుంది.

ఆ ఊరికి (పేరు అనవసరం. మీరే ఊహించుకొంటారు) వెళ్లాలంటే ఊరికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉండే అడ్డరోడ్డు దగ్గర ఏ సాయంత్రమో బస్సు దిగండి. కూడలి నుంచి నాలుగు ఎర్రమట్టి రోడ్లు భూతలాన్నంతటినీ నాలుగు భాగాలుగా విభజిస్తున్న అక్షాల్లా సూటిగా వెళ్లిపోతుంటాయి. అక్కడ నిలబడి ఏ రోడ్డు ఎటు వెళ్తుందో ఊహించడానికి ప్రయత్నించండి. ఈ దారులన్నింటి వెంబడి ప్రతి రెండు మూడు కిలోమీటర్లకీ ఏదో ఊరు తగులుతుంది- కొన్నిసార్లు రోడ్డును కౌగిలించుకోవడానికి సమీపించినట్టు, మరోసారి చెట్ల గుబురుల్లోంచి లీలగా కనిపిస్తూ, లేక ఈ దారి ఊసు తనకు పట్టనట్టు. ఏ కొండచాటునో నక్కుతూ- చిన్నవీ, పెద్దవీ ఊళ్లు, ఉండుండి ఓ ఎర్ర రంగు బస్సు దుమ్మురేపుతూ వచ్చి ఒకరిద్దరిని బయటికి తోసి వెళ్లిపోతుంది. అప్పుడప్పుడు ఏదైనా ఎడ్లబండి తీరికగా ఏదో పొలంలోకి, పల్లెలోకి మలుపు తిరుగుతుంది. సాయంత్రం పూట కూలిజనం తలపైన కట్టెలు, గడ్డిమోపులు, గంపలు పెట్టుకొని, చేతుల్లో కొడవళ్లు, కర్రలు పట్టుకొని తిరిగి వెళ్తుంటారు. పశువుల మందలు డెక్కలతో దుమ్ము రేపుతూ కాపరి అదలింపులకు తోకలెత్తుతూ, పేడవేస్తూ పోతుంటాయి. చూస్తూ ఉండగానే చీకటి చుట్టుముడుతుంది. బావుల దగ్గర జీతగాళ్లు వేసే మంటలు తప్ప ఏమీ కనిపించవు. మరేమీ వినిపించవు - అప్పుడప్పుడు వెళ్లే సైకిల్ మోటార్ల గుడ గుడ ధ్వని తప్ప.

కూడలి దగ్గర దిగిన మీరు ఆ ఊరి దిశను చూపే బోర్డు మీద చెరిగిపోయిన అక్షరాలను చూసి, మీ పెట్టె బరువును అంచనా వేసి, కాళ్లకు కలగబోయే అలసటను ఊహించి విసుగ్గా నడవటం ప్రారంభిస్తారు. కాని జాగ్రత్తగా చూశారంటే భూమి కూడా రంగులు మారుస్తూ కనిపిస్తుంది. చిక్కని ఎర్రమట్టి నేలలు చూస్తూ ఉండగానే ఇసుకపర్రల అంచులను చేరుతాయి. ఇంకొద్దిగా ముందుకు సాగి చెరువు కిందో,

కుంట వెంబడో ఫక్తు చవుటు పొలాలు ఉండటం చూస్తారు. అవి క్రమంగా అసంకల్పితంగా, నల్లరేగడి చేలల్లోకి మారిపోవటం చూస్తారు. మరోచోట చిన్నా, పెద్దా రాతిగుళ్లతో విచ్చలవిడిగా నిండిన బంజరు క్షేత్రం కనిపిస్తుంది. దగ్గర్లోనే భూమిలో నుంచి కాఠిన్యం అంతా పుంజుకొని వచ్చిన ఓ నల్లరాతి కొండ వైరాగ్యాన్ని, సృష్టి నగ్నత్వాన్ని కఠోర నీరవత్వాన్ని తన భారంలో కూడగట్టు కొని ఆకాశంలోకి చూస్తూ దర్శనమిస్తుంది. మీరు దారి తప్పి ఈతచెట్లను, తాటితోపులను దాటి వెళ్తే ఓ మోస్తరు ఏరు తటస్థపడవచ్చు. అందులో ఇసుక, గులకరాళ్లు, ఎండమావులు తప్ప నీరు కనిపించదు. ఒక ఊరి తరువాత మరో ఊరు.

నిజానికి నదులు, కాలవలతో తడిసి సార వంతమై, పచ్చటి పొలాలతో ఎల్లప్పుడూ సస్యశ్యామ లమై, అన్నపూర్ణ అయి విలసిల్లే ప్రాంతం కాదిది. అయినా రైతులు నాగళ్లతో తరతరాలుగా కెళ్లగించు తుంటే, వాళ్ల భార్యల లాలనలకి నలిగి మెత్తబడిన ఈ భూములు కూడా కోరికగా ఎదురుచూస్తుంటాయి- గర్జనల కోసం- భూమ్యాకాశాలు ఏకం చేస్తూ జలాలే కురిస్తే తమ హృదయ కుహరపు లోసొరుగుల దాకా చితుకుల మంటల్లా వ్యాపించిన దప్పికను తీర్చుకొనే క్షణం వస్తుందనీ, తృప్తి కలుగుతుందనీ. కాని మేఘాలు టక్కరితనం పెంచుకున్నాయి. అసలు రావు. వచ్చినా కురవవు. కాబట్టి మీరు ఈ ఎండు నేలలను, నెర్రలు పట్టిన వరిపొలాలను దాటి ఊరి చెరువు దగ్గరకి చేరి నపుడు చూసేది ఓ గుంట నీళ్లలో ప్రతిఫలించే వెర్రి ఆకాశాన్ని మాత్రమే.

*

మూడేళ్లు కావస్తోంది. ఆనాడు ఎన్నో రోజులకి మళ్లీ అమ్మమ్మ ఊరికి వెళ్లాను. మంచి వేసవి- తొమ్మిది గంటలకి బస్సు దిగేసరికి అప్పటికే గాలి తేలికపడి ఉక్కపోతగా ఉంది. వ్యవసాయం పనుల్లేక చేలల్లో ఎవరూ లేరు. పాలపిట్ట ఒకటి భూమికి దగ్గరగా ఎగురుతూ వెళ్లిపోయింది. అక్కడక్కడ వేపచెట్ల కింద జోరీగల ధ్వని తప్ప మరో చప్పుడు లేదు.

ఊరి ఇవతలే ఉన్న ప్రైమరీ స్కూలు తాళం వేసి ఉంది. చెట్ల నీడల్లో ఐదారుగురు పిల్లలు చడీచప్పుడూ చేయకుండా ఆడుకొంటున్నారు.

అరగంట దాటేసరికి ఆమె ఇంటి ముందున్నాను. ఇల్లంటే- ఆమె వ్యక్తిత్వానికి, గాంభీర్యానికి పోసగే పెంకుటిల్లు కాదది. ఆస్తి పంపకాలు జరిగి ఇల్లూ, భూములూ అన్నీ ముక్కలు చేసుకున్న తర్వాత ఆమె వాటాకు వచ్చిన చిన్న భాగమది. అన్ని ఇళ్లలాగే పైన పెంకులు పేర్చిన ఎత్తైన ప్రహరీగోడ. కాని వీధి తలుపు లోంచి ప్రవేశించగానే ఆ ఇంటి ఖాళీతనం, బోసి వాతా వరణం చెవుల్లో గింగురుమంటూ పీడించింది. ఏదో తాత్కాలికంగా చేసుకొన్న ఏర్పాటులా ఉంది తప్ప, ఒక కుటుంబం ఉంటే వచ్చే నిండుతనం కానీ, తరతరా లుగా నివసించిన ఇంటి స్థిరత్వం కానీ ఏమీ కనిపిం చవు. అరుగు మెట్లెక్కి, గోడ ఆసరాగా నిలబెట్టిన బల్ల పైన పెట్టెను ఉంచి లోనికి చూశాను. ఏమాత్రం అలికిడి లేదు. అంతా అసహజంగా అనిపించింది. పిల్లల అల్లరి, ఆడవాళ్ల ముచ్చట్లు, పెద్దల సంచలనంతో నిండి ఉండా ల్సిన ఇల్లు కాదా ఇది?

''ఎవరొచ్చింద్రూ?'' అంటూ లోపలి గదిలో నుంచి సగం వంగి తొడలపైన చేతులు ఆన్చి గుమ్మం దాటి వస్తూ అడిగింది ఆమె. ఎప్పటిలాగే ముతక నీలం రంగు చీర, కళ్లకు పాతబడిన అద్దాలు. చెంపలు గుంటలుపడి, కళ్లు కొద్దిగా లోనికి వెళ్లి ముఖం ఓ మోస్తరు తీవ్రతను సాధించుకొంది. వెడల్పైన నుదుటి పైనా, చెంపలపైనా ఉట్టిపడే ఆకారం. కాని ఆ ముఖం పైన మార్దవత్వం కనిపించడానికి ఎంతోసేపు పట్టదని పిస్తుంది.

''నేను అమ్మమ్మా, సుధీర్‌ని,'' అన్నాను.

''ఓసి నువ్వా? ఈ టయింల ఎవరొచ్చింద్రాను కుంటున్న,'' అని కుశల ప్రశ్నలు వేసింది.

కొద్దిగా కంపించే సన్నని తీగలాంటి కంఠస్వరం ఆమెది. ఎన్ని సంవత్సరాల తర్వాత వచ్చాను! కాని ఆమె ధోరణిలో ఏమాత్రం తొట్రుపాటు లేదు.

పెరట్లోకి వెళ్లి కాళ్లూ, చేతులూ కడుక్కొన్నాను.

ఆమె వంటగదిలో పొయ్యి రాజెయ్యడం ప్రారం భించింది. రెండు గదులూ, వాటి మధ్య ఓ వసారా, ఓ వంటగది, ముందూ, వెనుకా కొద్దిగా ఖాళీస్థలం- ఇది ఆమెకి మిగిలిన ఇల్లు. ఒంటరితనం వసారా నుంచి ఆ గదుల్లోకి, అక్కడి నుంచి మళ్లీ వసారాలోకి వ్యాపిస్తున్నట్టు ఉంటుంది. ఆ గదుల్లో ఉండే సామాను గురించి ఊహించుకోవచ్చు. రెండు మూడు సొట్టలు పడి రంగు వెలసిన ట్రంకుపెట్టెలు, కొన్ని వెదురు, తాటాకు గంపలు, గూట్లో దేవుడిపటం, పక్కబట్టలు- అటుమూల, ఇటుమూల సర్దినట్లున్నాయి. వసారాలో పాతబడిన ఓ పెద్ద మంచం. పక్కన నగిషీ చేసిన పాత కుర్చీ హుందాగా.

ఆమె వంటచేసి వచ్చి మంచంలో కూలబడింది.

"పని చాతనవుతున్నదా?" అని అడిగాను.

"చాతగాకుంటే మాత్రం చేసుకోవద్దా బిడ్డా?" అంది. "ఇంకేమున్నది? ఉన్న కిద్దిగన్ని రోజులు ఎట్లనో యెల్లదీసి కాల్జెయ్యి ఆడుతున్నపుడె పోతెగదా- ఆ పరమాత్ముని దయుంటే?"

"ఒక్కదానివే ఈ ఇంట్లో ఉండకపోతే ఎవ్వరి దగ్గరన్నా ఉండొచ్చు కదా? అమ్మ ఎప్పుడూ అంటూం టుంది," అన్నాను.

"అయన్నీ ఎందుకు అడుగుతవయ్యా? ఎవరి దగ్గర్కి పోతే యేమున్నది? నా బర్వు వాల్లు మోయ్యాలె, వాల్ల గోస నేను చూడాలె?" నిష్ఠూరమాడుతూ అంది ఆవిడ. ఆ నిష్ఠూరం ఒకర్ని ప్రత్యేకంగా ఉద్దేశించింది కాదు, ఒకర్ని విస్మరించి అన్నది కూడా కాదు.

తన గూడులో తానై, తన గతంతోపాటు మిగతా ప్రపంచమంతా మరో పెద్ద గూడై, దాన్ని ఆవిడ దూరం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నట్టు అనిపించింది నాకు. మాట్లాడకుండా ఊరుకున్నాను. ఇటువంటి వాటికి ఎవరి దగ్గర జవాబులుంటాయి? అలాగే కూర్చున్నాను. ఆవిడ కూడా సూటిగా వీధిలోకి చూస్తూ కూర్చుంది- పిచ్చుగుంటి దొకతే పాడుకుంటూ వెళ్తూ ఇక్కడేమీ దొరకదులే అన్నట్టుగా గుమ్మంలోంచి ఎగాదిగా చూసి వెళ్లిపోయింది.

ఆవిడ మెల్లగా ప్రారంభించింది.

"మీ తాత ఉన్ననాడు ఇట్లుండెనా? ఆయన పాయె, పోతుండగనె సంసారం చెడిపాయె. ఇక ఈ కాలాలు, వర్షాలు గూడా కలిసిరావాయె. అయ్యో బిడ్డా, ఏం బతుకులయిపోయినయ్!" క్షణంపాటు ఆమె కంఠం రుద్ధమవుతూ వణికింది. కాని నిబ్బరించుకొంది. నిలిచి నిలిచి మాట్లాడుతున్నా అప్పటికే ఆక్రోశం తలుపులు తెరుచుకొని బయటికి వచ్చేసింది. "హయ్యో, బతికినన్ని రోజులు అందరు కచ్చితం మనిషి అనుకొన్నరుగాని అట్ల లేకుండనే ఈ సంసారం నడిచెనా?"

నిజానికి మా తాతయ్య బతికినన్ని రోజులూ ఇంట్లో ఎవరికీ ఎదురుతిరిగే ధైర్యం ఉండేది కాదు. ఎప్పుడో వికట కోపం వచ్చినప్పుడు తప్ప ఆయన నెమ్మదిగా, శాంతంగానే మాట్లాడేవాడు. అయితేనేం ఇంటా, బయటా ఆయన ఉన్న చోటే అనుశాసనం వున్నట్టుగా ఉండేది. ఇక మా అమ్మమ్మ పిల్లలు పెద్ద వాళ్లయి, మనవలు పుట్టి వాళ్లు కూడా బళ్లకు వెళ్తున్న నాటికి, శరీరం పట్టు, సత్తువ సడలి పొలం పనులకు వెళ్లడం మాని, ఇంటి పట్టున ఉండడం ప్రారంభించింది. కోడళ్ల మధ్య అసూయాద్వేషాలు, సాగే రుస రుసలు అన్నీ గమనిస్తూ అంటీ అంటనట్టుగా వ్యవహరిస్తుండేది. సంసారం బయటివారికి పకడ్బందీగా సాగుతున్నట్టే కనిపించేది.

కొడుకులు తమ బాధలు, కోర్కెలు తండ్రితో సరాసరి చెప్పే ధైర్యం లేక ఆమెతోనే చెప్పుకొనేవారు. జరగవల్సిన తతంగం ఆమే నిర్వహించేది. పొలంపనుల గురించి కోడళ్లను కనుక్కొంటూ, మెలకువలు చెప్తూ, జీతగాళ్లకి భోజనాలు పెడుతూ, కూలీలకి ధాన్యం కొలుస్తూ, వచ్చిన పంటను గరిసెల్లో పోయిస్తూ, పురుళ్లు, పూజలు జరిపిస్తూ- నిజంగా మా చిన్నప్పుడు ఆమె పడే హడావుడి చూస్తుంటే తమాషాగా అనిపించేది.

"మీ తాత పోయిననాడు ఇప్పటికి గుర్తుస్తుంటది. దమ్ము రోగం ఉండె కద. ఆరునెల్లు పిసికి, పిసికి ప్రాణం తీసింది. ఆకర్లో నెలరోజులు మంచం మీదికెల్లి లేవకనే పాయె. నేన్జెప్పినా, కొడుకుల్జెప్పినా పెద్ద దవాకానకు పోదమంటే ఒప్పుకోకపాయె. ఇక ఆ మనిషిని బలవంతం చేసే ధైర్యం ఎవరికుండె?

"పూర్తిగా పొద్ది పొడవనె లేదు, నన్ను పిలువనంపిండు, రాఘవులుకు జెప్పి జీతగాళ్లక పన్జెప్తున్నదాన్ని ఒదిలిపెట్టి ఒచ్చిన. ఊపిరి పీల్చుకో రాకుండె. అందరినీ పిల్వమని చేతుల తోటి సైగలు చేసిండు. రాఘవులు కిదే పని, అందరిని పిలుచుకొచ్చె. కోడళ్లు, పిల్లలు, మనుమలు అందరు ఉండంగ అందర్ని చూసి రెక్కలు కొట్టుకొని కొట్టుకొని చనిపోయిండు. బతికినన్ని రోజులు ఒక్క జేతి మీదగ సంసారం నడిపించిన మనిషి, ఒకరికి తలొంచినోడుగాదు. ఒకరి దగ్గర చెయ్యి పట్టినోడు గాదు. అట్ల కొట్టుకుంటుంటె గూడ చేసేటందుకు ఏవీ లేకపాయె. ఎట్ల బతికితె యేవున్నది బిడ్డా పానం పొయ్యే కాడ అంత ఒకటే గద?"

నాకు చెబుతున్నా ఆమె స్వగతంలో పునరుక్తమైన మాటలను మళ్లీ నెమరు వేసుకొంటున్నట్టు మాట్లాడుతోంది. ఉబికి వచ్చే దుఃఖం మాటల మధ్య విరామాల్లో సమసిపోతున్నది. ఆ ఘటన ఆమె జీవితాన్ని రెండుగా విభజించేసింది కాబోలు!

"ఆ పుణ్యాత్ముడు బోయి గివన్నీ చూసేటందుకు నన్నుంచి పోయిండు," అంటూ కళ్లు తుడుచుకొంది.

భోజనం చేసి కూర్చునేసరికి ఒంటి గంట అయ్యింది. ఆమె వసారాలో నడుం వాల్చింది. ఊళ్లోని ప్రైవేట్ స్కూల్‌కి ఇంటర్వెల్ అయ్యింది కాబోలు ఇళ్లకి

వెళ్తున్న పిల్లలు వసారాలో కొత్త మనిషిని వీథిలోంచి చూస్తూ వెళ్తున్నారు. ఇద్దరు పిల్లలు వీథి తలుపు దగ్గరే నిలబడి నన్ను చూసి గుసగుసలాడుతూ నవ్వటం ప్రారంభించారు. ఆమె మంచం మీది నుంచి తల తిప్పి చూసింది.

''యెవ్వరదీ? ఓరి చెంద్రారెడ్డీ, తలుపు దగ్గర ముచ్చట్లేంది, మీ చిన బావ కాదురా?'' అని పిలిచెసరికి వాళ్లింకా సిగ్గుపడుతూనే కుతూహలంగా లోపలికి వచ్చారు.

''ఇగో, వీడు మీ చిన మావ రాఘవయ్య కొడుకు. ఇగ ఇదేమో మల్రెడ్డి మనుమరాలు, రామారం ఇచ్చినం సూడు శకుంతల, దాని బిడ్డ. అమ్మమ్మ తాన ఉండి చదువుకుంటున్నది. మీ నాయనొచ్చినాడురా పట్నం తిరగబోయి?''

''రాలే, రేపు ఒస్తడంట. గుర్నాదం రాత్రి చెప్పిండు.''

''ఏం ముల్లె సర్దుకొస్తున్నడయ్య వారం రోజుల నగం బోయి?''

''నన్నెందుకడుగుతవు? నాకేమెరుక?'' అని వాడు కొరకొరా చూశాడు.

''ఇక నీల్గకు! అన్నం తిని దబ్బున బడికి వో,'' అని వాళ్లను పంపించేసింది.

''ఆయన తిరుగుళ్లు గాదు, ఈ ప్రభావతమ్మ సోకులు గాదు? నెలనెలా పట్నం పోతడు. ఆ పన్జేస్త, ఈ పన్జేస్త అనుకుంట. ఎప్పుడు పది రోజులయినంక చేతులూపుకుంట వచ్చుడేనాయె! ఇగ పదోటెదో ఏదో పెండ్లి కాకముందు ఎప్పుడో ఫేలయ్యింది గద, గిప్పటి దాక ఒళ్లు ఒంగనే ఒంగదాయె? సోకు జేసుకొని ఇంట్ల కూర్చుంటె పసుపు లేమైతున్నయి, బూవులకాడ ఎవడేం జేస్తున్నడు ఎవడు సూడాలె? నేను తొందరగ సస్తె ఆ బ్యాంకిలున్న అయిదారు వేలు కూడ పంచుకొని మింగుదమని సూస్తున్నరు కాని మంచో చెడ్డో కష్టపడాలని ఉండాల్నా?''

ఆ ఆవేశంలో మళ్లీ నిశ్శబ్దంగా ఉండిపోయింది. మౌనాన్ని నేనే భంగం చేయాల్సి వచ్చింది.

''మల్లారెడ్డి మామ ఆరోగ్యం ఎట్లున్నది?'' మా నలుగురు మావయ్యల్లో పెద్దవాడతను.

''డాక్టర్ల దగ్గరికి పోతున్నడు, మందులు తింటున్నడు. శక్కర్ బీమారి, ఓ మానాన తగ్గుతదా? పెయ్యి చేతగాకుండ అయ్యింది. ఇక వ్యవసాయం- ఏం వ్యవసాయం? జీతగాళ్ల మీద ఒదిలి నమ్మేటట్టున్నది? సరిగ్గ కాలమై ఎన్నేళ్లాయె? ఆ యెశోదకు వ్యవహారం తెలవదు. యేదో తిండికి గింజలు ఎల్తున్నయి- గంతకంటె ఏంలేదు. మంచో చెడ్డో సూసుకునేటందుకు కొడుకులు లేకపోయిరి. ఇగ బిడ్డలున్నరు, వాళ్ల సంసారాలు ఇడిసి పెట్టి ఏం వొస్తరు? మా ముచ్చట్లు సెప్పుకుంట కూర్చుంటె ఓ పొద్దు ఒడుస్తాయి బిడ్డా! ఇక అన్నానికి లే?'' అంది నిట్టూరుస్తూ.

మధ్యాహ్నం ఓ కునుకు తీసి సాయంత్రం బావుల దగ్గరికి వెళ్లాను. మా తాతయ్య చనిపోయే నాటికి తన కుటుంబానికి ఓ రెండు బావులు, పది హేను ఎకరాల వరి పొలం సాధించి పెట్టాడు. అదికాక నలభై ఎకరాల మెట్టపొలం, ఓ పది ఎకరాలు పశువులు మేయడానికి పనికివచ్చే బంజరుభూమి కూడా ఉండేవి. వాళ్ల పెద్దబావి పక్కనే విశాలమైన స్థలంలో పశువుల కొట్టాలు, వాటి ఎదురుగా బాగా విస్తరించిన అయిదారు చింతచెట్లు తమ నీడలో ఉన్న వారందరినీ కాపాడుతున్నట్టు ఉండేవి. ఆ చెట్లనీడలో కుక్కిమంచం మీద కూర్చొని వయసుమళ్లిన మా తాతయ్య తలకు తెల్ల రుమాలు చుట్టుకొని, మోదుగ ఆకు నొకదాన్ని చుట్టలా చుట్టి అందులో పొడి చేసిన పొగాకును నింపుకొని, చెకుముకి రాళ్లతో దాన్ని వెలిగించి, తాపీగా పీలుస్తూ కొడుకులకి, జీతగాళ్లకి పని పురమాయిస్తూ వ్యవసాయం నిర్వహిస్తుండేవాడు.

సాయంకాలాలు ఎప్పుడూ హడావుడిగా ఉండేవి. పనికి వెళ్లిన ఎడ్లబళ్లు, నాగళ్లు తిరిగి వచ్చేవి. ఆవులు, గేదెలు తమ దూడలతో సహా రంకెలు వేస్తూ తాపీగా కొట్టాల్లోకి పోతుండేవి. ఎడ్లు, దున్నపోతులను గాడి దగ్గరికి తీసుకెళ్లి నీళ్లు తాగించేవాళ్లు. జీతగాళ్లు ఇళ్లకు వెళ్లడానికి తమ పనులన్నీ ముగిస్తూ ఉండేవాళ్లు. ఎక్కువగా పనులుండని ఎండాకాలంలో కూడా తాటి, గోగునారలతో తాళ్లు పేనుతూ ఎడ్లకి మేత వేస్తూ, పేడ ఎరువు కుప్పలపై నీళ్లు చల్లుతూ ఏదో ఒక పని చేస్తూ కనిపించేవాళ్లు. హృదయాన్ని కెలికినట్టుగా ఆ జ్ఞాపకాలన్నీ మెదిలాయి.

ఒక్కటి తప్ప చింతచెట్లన్నీ మాయమైపోయాయి. వాటి విశాలమైన ఛాయలు లేక ఆ ప్రదేశం నిండుతనం కొరవడినట్లనిపించింది. పాత పశువుల కొట్టాలు రాతి గోడలు విరిగి, పెంకుకుప్పలు ఎగిరిపోయి శిథిలాల్లా మారిపోయాయి. బావి ముందున్న మోటారు దారులు చాలావరకు పూడుకుపోయాయి. పాతాళంలోకి దిగిపోయిన నీళ్లను తోడడానికి ఒక ఎలక్ట్రిక్ మోటర్ వుంది. ఎవరికివారు తలా ఒక చిన్న పశువుల పాకని విడివిడిగా కట్టుకొన్నారు. పశువులు కూడా నామమాత్రంగానే

వున్నాయి. ఒకరిద్దరు తప్ప జీతగాళ్లులేరు. గాడిలో ఓ మూలగా కొన్ని మురికినీళ్లు మాత్రం ఉన్నాయి. అంతటి ప్రశాంతత నిరర్థకంగా తోచింది. ఖాళీ వరిపొలాల వైపు చూస్తూ కూర్చున్నాను.

అంతలోనే మా మూడవ మామయ్య సోమిరెడ్డి జీతగాడితో కట్టెలమోపు మోయిస్తూ వచ్చాడు. ఊళ్లోకాని బయటకాని పలుకుబడి ఏమీ లేకపోయినా రాజకీయాల్లో సదా మునిగితేలే ఆశాపక్షి ఆయన. ఏదో ఒక రోజు జాతకం తిరగబడి తనని ఎమ్మెల్యే చేస్తుందని ఓ నమ్మకం. ఇండిపెండెంట్‌గా రెండుసార్లు పోటీచేస్తే ధరావతులే కాకుండా ఉన్న కొద్ది డబ్బూ పోగొట్టుకున్నా నిరుత్సాహపడని సాహసి. ఎప్పుడూ ఇస్త్రీ చేసిన తెల్ల ఖద్దరు బట్టలు ధరించి, నున్నగా గెడ్డం గీసుకొని ఠీవిగా కనిపిస్తుంటాడు.

''ఏవిటి బాయి దగ్గరికి వచ్చింద్రు? ప్రతిరోజా ఇవ్వాళ ఒక్కరోజేనా?'' అని అడిగాను.

''రోజూ ఇక్కడేం పనిరా నాకు? రాత్రికి పాల కేంద్రం ఆఫీసర్లు ఇద్దరు వస్తరు- ఇంట్ల పొయ్యిల కట్టెల అయిపోయినయంటె ఇగొ వీనితోటి తీసుకుబోతున్న! వ్యవసాయంల ఏం బరకత్ ఉన్నదిర, దండగ పని,'' అని ప్రశ్నార్థకంగా చూశాడు.

చర్చ మెల్లగా రాజకీయాల్లోకి దిగింది.

''చూస్తూ ఉండు, నేన్జెపుతున్న గద- ఇంకో అయిదేండ్లకు ఈ కాంగ్రెస్ ఉండదు, ఈ తెలుగుదేశం ఉండదు- చెప్పు, వీళ్లకంటే న్యాయమైనోళ్లు రావాల్నా వద్దా? ప్రజాస్వామ్యం అంటే ఏంది- ఎప్పుడూ నాదే రాజ్యం నాదే రాజ్యం అని వీళ్లే ఉండాలంటే నడుస్తదా?'' అన్నాడు.

మిక్కుటమైన లోకజ్ఞానం ఆయనది! మౌనంగా ఊరుకొన్నాను.

చీకటిపడుతూ ఉండగా ఇంటికి చేరుకొన్నాను. వసారాలో మంచం మీద కూర్చొని, గోడ కానుకొని కాళ్ల మీద కూర్చున్న మరో ముసలావిడతో ఆమె మాట్లాడుతోంది. లో వోల్టేజి కారణంగా వసారాలో బల్బు గుడ్డి దీపం కన్నా హీనంగా వెలుగుతోంది. వారిద్దరి ఆకారాలు మసకగా కనిపిస్తున్నాయి. నన్ను చూడగానే రెండవ మనిషి మెల్లగా లేచి నిలబడింది.

''లేవకు, లేవకు, పార్వతమ్మ చిన్నకొడుకు గాదూ?'' అని ఆమె ఆ రెండో మనిషితో చెప్పింది.

''అయ్యో గట్లనా! నేను గుర్తుపట్టలేదు, సచ్చేం!'' అని నా ముఖాన్ని దగ్గరగా పరిశీలించి అంది ఆ మనిషి, ''ఎప్పుడో చిన్నగ ఉండగ సూస్తిమి.''

''బాయి కాడికి బొయ్యొచ్చినవా?'' అని అడిగింది ఆమె.

''ఆ!''

''ఎట్లున్నది?'' వ్యంగ్యంగా అడిగినట్లు అనిపించింది.

''ఏమీ బాగాలేదు, చెట్లన్నీ నరికేసినట్టున్నారు,'' అని పొడిగా చెప్పాను.

''అవునయ్య! నరికెయ్యక ఏంజేస్తరు? మీ సోమిరెడ్డి మావున్నడు గద? ఆయనకు ఖర్చు పెట్టెటందుకు చేతిల పైసలు ఉండాల్నాయె. రాజకీయం, లీడర్‌గిరి అనుకుంట పెండ్లాం మెడమీద బంగారం, భూములు కూడ కొన్ని నాశనం చేసె. అన్ని అయిపోయినంక చెట్లు కండ్ల బడ్డయి. ఆ పాలకేంద్రం నడుపుకుంట ఏం చేసిండో ఏమో పైసలు అవసరమైనయి. ఎవరికి చెప్ప కుండ లారీవాళ్లకు అమ్మేసి ఒక రాత్రి కొట్టించడం మొదలుపెట్టిండు. తెల్లారగట్ల తెలిసి అందరు పోయి అడిగితే తలా రెండువేలు చేతిలో పెట్టి నోర్లు మూయించిండు.

''ఏనాటి చెట్లు గవ్వి? నేను ఈ ఇంట్లకు రాక ముందెప్పుడో మా మామ బెట్టినయి! పదిహేను లారీల కట్టెలు ఎల్లినయంట! పొయ్యిల కట్టెలు. చాల గోస అనిపించింది. కాని అయ్యా, వీళ్లతోటి వీళ్ల ఆస్తుల తోటి సంబంధం ఒదులుకున్నంక నేనెందుకనాలె? అని ఊరుకొన్న.

''అయినా ఒకసారి సోమయ్య వస్తే అడిగిన. మన తాతలు పెట్టిన చెట్లుగద, అవి నరకకపోతే గడవక పోయినదా? అని. ఏమంటడు? నవ్వుతడు. తలా రెండు గంపలు చింతకాయలు ఇస్తున్నయి యాడాదికి, అంతకంటె ఏం లాభం ఉన్నది అవి ఉండి, అన్నడు,'' ఆవిడ స్వరం తగ్గుతూ పోయింది.

క్రమంగా ఆ రెండవ మనిషి అందుకొంది. ''వీళ్లకేం తెలుస్తదమ్మ మన కాలంలో జేసిన కష్టం? దండగ తెలవదు. రావిరెడ్డి పటేలు వయసుల ఉండంగ ఏగిల బారంగ మొదలుబెట్టి పొద్దుగుంకేదాకా- ఆ కష్టం కాదు, ఆ పనికాదు. ఇగ జీతగాళ్లు వంగక ఏంజేస్తరు?

''ఇగ పెద్ద పటేలమ్మ ఉండె, మీ తాతమ్మ అయ్యా,'' అంది నా వైపు చూస్తూ. ''నెమ్మది మనిషి, ఆ నెమ్మదితనమేగాదు ఈ సంసారాన్ని పైకి తెచ్చింది?

''ఇగో పటేలా, మీ అమ్మమ్మ, నేను ఈఊరికి ఒక్కసారే ఒచ్చినం- రెండు మూడునెల్లు ముందెనక, గంతే. ఇగ చిన్నపిల్లల ముంటిమి. మాకు సోపతి కల్సింది.

"మీ అమ్మమ్మ మొదటి సందే పట్టుదల మనిషి. అయ్యో సుభద్రమ్మా, జర బియ్యం ఏరిపోదువురా, కంచెకాడికి బొయ్యి దోసకాయలు తీసుకరా, ఆముదాలు ఏరబోదాము, కలుపు తియ్యబోదామురా అని వీళ్లత్త తీరుతీరుగ ఏది జెప్పినా ఈమె మనసుకు అనిపిస్తే పోయ్యేది లేకపోతే లేదు. ఇక కొద్ది ఎక్కువ కోపం జేసెనా, ఇంటెనక గోడ దునికి ఎవరింట్లనన్న పోయి కూర్చునేది. అప్పుడు గోడ కిందికే ఉండే. ఇగ మా యిద్దరి సోపతి జూసి వీళ్లత్త ఒకటే సాగతీస్తుండె, 'నీకు ఏం సోపతె? ఇంట్ల పని, పొలంల పని ఎవరు జెయ్యాలె నీ తొవ్వన నువుబోతె తల్లీ?' ఇగ అంతె- ఈమె రెండు రోజులు అలిగి కూర్చునేది."

మా అమ్మమ్మ ఇబ్బందిగా నవ్వేసి, "బాగనే చెప్తున్నవు ముచ్చట్లు!" అంది.

"అయ్యో! అబద్ధం చెప్తున్నామ పటేలమ్మా?" అని మంగమ్మ రాగం తీసింది. "ఈమె గిట్ల మూతి ముడుసుకొని కూర్చుంటె మా పటేలేవెూ వాళ్ల నాయనను కూర్చోబెట్టి కష్టమంత తనే జేస్తుండె కొడుకిట్లుండె, కోడలిట్లయిపాయె ఏంది అని పెద్ద పటేలమ్మకు చాల దుక్కముండె. ఇక ఒకరోజు ఈమెను దగ్గర కూర్చోబెట్టుకొని చెప్పింది. నా కొడుకు బంగార మసుంటోడు. కష్టపడతడు. వానితో గలిసి నువ్వు సంసారం నడిపిస్తివా చాల పైకొస్తది. నీకు కూడ గౌరవం ఉంటది పదిమందిల. ఇగ నిన్ను కోప్పడో, కొట్టో చెప్పుడు నాకు చాతగాదు. తర్వాత నీ ఇష్టం. ఆ దేవుడి ఇష్టం.'

"ఈమె ఏమనుకున్నదో ఏమోగాని ఆ దినం నుంచి బాయికాడ పటేలుకు బువ్వ తీసుకుపొయ్యేకాడి నుంచి అన్ని పనులు సేసుడు మొదలుబెట్టింది మెల్లమెల్లగ. అన్నిరోజులు మాట్లాడకుండ ఊరుకున్న పటేలు ఈమె ఇట్ల కాంగనే చాల సంబరపడిపోయిండు," అని నవ్వేసింది.

సిగ్గుపడటం మా అమ్మమ్మ వంతు అయింది. తల వంచుకొని కళ్లలో నీళ్లు తుడుచుకొంది.

"అవన్నీ అనుకుంటె ఏమొస్తది?" అని చెప్పడం ప్రారంభించింది. "కొడుకులు, బిడ్డలు మంచోళ్లు కావలె. కోడళ్లు మంచోళ్లు ఉండాలె అని ఎప్పుడనేది. కాని ఎవరెన్ని రోజులు, మంచిగ ఉంటరొ మనకెట్ల తెలుస్తది? మా చిన్న కోడలు సూడరాదు. ముత్తెమంత పని చెయ్యదుగాని రామరం పోయి ప్రతి వారం సేన్మ చూడాలె. 'మా అత్త బంగారం అమ్మి బ్యాంకిల వేసుకొన్నది. కొడుకులికిస్తే ఈమెకు పూటకింత పెట్టరా,' అని అంటుందంట. ఇంత సిగ్గు వదులుకొన్నోళ్లు నన్నేం చూసుకుంటరయ్యా?

"ఇక ఆ లీడరు సాబ్ భార్య కమలమ్మ ఆయన చాతలు సూడలేక ఇప్పటికి మూడుసార్లు బాయిల దుంకింది. రెండుసార్లు కాల్జేయ్యి ఇరగ్గొట్టుకున్నది. ఎంత ముద్దుగున్నది సూడు ముచ్చట?"

"అప్పట్ల మల్లయ్య, భద్రయ్య మేం కష్టం జేస్తున్నం తిరుగుతున్నారని బాధపడతుండె. గందుకె ఈ కొట్లాటలు నా కొద్దు, ఈ మాటలు నా కొద్దు. ఒకరు ఎక్కువ తింటున్నరు, ఒకరు తక్కువ పన్జేస్తున్నరు అని మీరు నా ముందు అనుకోవద్దు, నాకు మాట ఒచ్చేటట్టు చెయ్యొద్దు- ఈ ఆస్తి మీరే సంపాదించింది గద, మీరే పంచుకోండ్రి, ఒక అయిదు తులాల బంగారం, ఇంట్ల ఒక మూల భాగం నా పాలుకిస్తే నేను మీ జోలికి రాను, మీకు నా బరువొద్దు, అన్జెప్పి వదిలించుకున్న.

"ఇగ ఆ అయిదారు వేలు మొత్తం అయిపోక ముందే ఆ దేవుడు తీసుకుపోతే సాలు- ఈ కండ్లతోటి సూసింది సాలు, నాయనా!"

మా సంభాషణ అలాగే సాగేదేమో కాని మా సోమిరెడ్డి మామ రావడంతో అడ్డుకట్ట పడింది.

"భోజనానికి రావాలె. కోడ్ని కోయించిన," అని కూర్చున్నాడు.

డెయిరీ కార్పొరేషన్ ఉద్యోగస్తులిద్దరితోపాటు నాకు సుష్ఠుగా భోజనం పెట్టించాడు. తోడుగా వాళ్ల కోసం మద్యం. ఘాటైన మసాలా వాసనల మధ్య మేం చెమట కక్కుతూ తింటుంటే, "అమ్మ బాయిల పడింది," అని చిన్న కొడుకు ఏడుస్తూ వచ్చి చెప్పాడు. ఈ వ్యవహారం వాడిక్కూడా మొదటిసారి కానట్టుంది.

అంతవరకు ఉత్సాహంగా ఉన్న మామయ్య ముఖంలో నెత్తురుచుక్క లేదు. "ఇదేంటిది రెడ్డి సాబ్?" అంటూ ఆ ఇద్దరు ఆయనతోపాటు వడిగా బయటికెళ్లారు. చేదతాడు సహాయంతో ఆమెను బయటికి లాగేసిన తర్వాత నేను అమ్మమ్మ ఇంటికి వచ్చి కూర్చున్నాను.

"చూసినవు గదా?" అని లోపల ప్రశ్నిస్తున్నట్టుగా ఆమె చూరుకేసి చూస్తూ పడుకొంది.

వాకిట్లో ఉన్న వేపచెట్టు ఆకులు సన్నగా సాగే గాలి అలలకు అల్లల్లాడుతున్నాయి. చతుర్దశి చంద్రుడు కాబోలు వెన్నెల అతి సుకుమారంగా వాతావరణంలో నిండసాగింది. ఊరంతా నిద్రపోవడానికి ఉద్యుక్తమవుతున్న ఆ సమయంలో సోమిరెడ్డి ఇంట్లోంచి వినిపిస్తున్న అరుపులు, ఏడుపులు రాత్రి ప్రశాంతతను కోసేశాయి.

నడిరాత్రి అయ్యాక గాలి నిలిచిపోయి భరించ లేనంతగా ఉక్క పోసేసింది.

*

తరువాత రోజు దినమంతా ముగ్గురు మామయ్యల ఇళ్లకు వెళ్లడానికి సరిపోయింది. సాయంత్రం హఠాత్తుగా ఈదురు గాలి ప్రారంభమై వాకిళ్లను, వసారాలను దుమ్ముతో నింపేసింది. ఇంటికి వచ్చి చూస్తే ఆవిడ ఇంట్లో లేదు. కొద్దిసేపటికి వగరుస్తూ వచ్చింది.

"జినమయ్య ఇంటికి పొయ్యొస్తున్న. రేపు ఓ యాభైమంది చుట్టుపక్కల ఊళ్ల నుంచి కూడగట్టి యాత్రలకు తీసుకు పోతున్నడంటే కనుక్కొందామని పొయ్యిన. శ్రీశైలం, తిరుపతి- చాలనే సూపిస్తరట. వారంరోజుల యాత్ర- మళ్లెప్పుడు జూస్త. ఇది కూడ జూస్తే అయిపోతది కద అనుకుంటున్న," అంది.

లోలోపలే నలిగి పోవడం కన్నా ఈ ప్రయాణం మేలే కదా అనిపించింది నాకు.

ఇంట్లోకి వెళ్లి పనులు చేసుకుంటూ, "తల్లి ఒళ్లకు చేరిండా బిడ్డా?" అని అడిగింది. సూర్యుడు అస్త మించాడా అని ఆమె ఉద్దేశం. అవునని చెప్పాను. కరెంటు లేకపోవడంతో లాంతరు వెలిగించి తీసుకొచ్చింది.

"అమ్మకు చెప్పు. యాత్రలయినంక ఎప్పుడన్న చూడ బుద్ధయితే వస్త. ఏమనుకోవద్దను."

"మళ్ల నిన్నెప్పుడు చూస్తానో?" అన్నాను.

ఆవిడ శాంతంగా జవాబు చెప్పింది. "ఇక్కడికి వచ్చేటందుకు ఇక్కడేమున్నదయ్యా? కాలాలు లేక కష్ట పడినోళ్లకే నడిచేటట్టు లేదు. భద్రారెడ్డిని, వాని పిల్లలను చూసినవు గదా? బట్ట సక్కగుందా, తిండి సక్కగుందా? సదువులు కూడ గంతంతనే. ఎంత కష్టంజేసినా అప్పులు పెరుగుతున్నయి కాని ఏమన్న మిగిలుతున్నదా? పెట్టుబడులెక్కువ, పంట తక్కువ మా కాలంలో గూడ కరువులొచ్చినయిగని నెఱియు గింత అధ్వాన్నము లేదు.

"మీరు ఉద్యోగాలు చేసేటోళ్లకు ఎట్లనన్న నడిచి పోతది. ఇక్కడ ఎవరు బాగున్నరయ్యా? తెలివిగ లీడర్ గిరి చేసేటోళ్లు, గుత్తేదారులు- గట్ల కొందరు. బూవినే నమ్ముకున్నోళ్లకు ఏమున్నది?"

ఆవిడలాగే గుండె దిటవు చేసుకోవడం తప్ప మార్గాంతరం లేదనిపించింది. మర్నాడు హైదరాబాద్ తిరిగి వచ్చేశాను.

ఆ తరువాత నెలరోజులు తిరక్క మునుపే వచ్చింది- సుభద్రమ్మ మరణించిందనే వార్త.

పని ఒత్తిడి కారణంగా అంత్యక్రియలు జరిగిన వారం రోజులకు కాని వెళ్లలేకపోయాను. అడ్డరోడ్డు నుంచి ఊరిదాకా నడక చైతన్యరహితంగా అనిపించింది. నాకు ఆ ఊరికీ మధ్య బంధం ఉండేది. ఆ సేతువుకి ఆఖరు ఆధారమైన వ్యక్తి కూడా చనిపోయింది.

ఆమె ఇంటి వీధి తలుపులకి వేసిన తాళం తీయించి లోపలికి వెళ్లాను. మృత్యువు ఛాయలేవీ ప్రత్యేకంగా ఆ ఇంట్లో కనిపించలేదు. అదే ఖాళీతనం, అదే నిశ్శబ్దం, గింగురుమనే బోసి వాతావరణం. ఆవిడ ఉన్నప్పుడు కనిపించిన ఒంటరితనం ఆ ఇంటిని ఎన్నటికీ వీడబోదు అనిపించింది.

నేను వచ్చానని తెలిసి మంగమ్మ వచ్చింది. ఏవేవో చెప్పసాగింది. యాత్రల నుంచి వచ్చిన వారం రోజులకి నిద్రలోనే, ఎవరికీ తెలియకుండా ప్రశాంతంగా మరణించిందని ('మీ అమ్మమ్మది పున్నెపు పుట్క నాయనా, నీ కాల్మొక్కుత!'), అంత్యక్రియలు జరుగక మునుపే సోమిరెడ్డి, చిన్న మామయ్య బ్యాంకు డబ్బు గురించి గొడవపడ్డారని, ప్రస్తుతానికి తలా కొంత అప్పు చేసి ఎలాగో అయ్యిందనిపించారని, మూడవనాడు పిండాల్ని ముట్టడానికి కాకులు తాత్సారం చేయలేదని- ఇత్యాదిగా.

ఆ సాయంత్రమే తిరుగుముఖం పట్టాను.

ధూళితో నిండిన మట్టిరోడ్లపైన బస్సు వేగంగా వెళ్తూ ఉంటే, పడమటి వైపు సూర్యుడు నిరాసక్తంగా ఖాళీ మైదానాల అవతల క్రుంగిపోతున్నాడు. సూర్యుడికి అభిముఖంగా నిలబడి నేలను, ఆకాశాన్ని తరచి చూస్తున్న ఓ రైతు ఆకారం క్రమంగా నల్లబడిపోతోంది.

*

అయితే ఏమిటి? ఇదేమీ నూతన సత్యం కాదే అని మీరు నిరసించవచ్చు. క్షమించాలి, మీ ఎదుట నేను అంత సాహసం చేయలేదు.

అయితే ఆ ఎండిన నేల, వింత భంగిమల్లో రాళ్లు పేర్చిన ఆ కొండలు, ఆ ఊరు- వీటి మధ్య ఆవిడ ఒంటరితనం- ఇవన్నీ మనస్సులో మెదిలినప్పుడు ఆ ఒంటరితనపు నిశ్శబ్దం దావానలంలా భుగభుగమంటూ ఆలోచనలను ఆవరిస్తుంది. ఆ అసంతృప్తినీ, తృప్తినీ మీతోనైనా పంచుకోవాలని!

*ఆంధ్రప్రభ వారపత్రిక, 17 జనవరి 1990*